Namasthe Telangana

Dt 16/11/17.





# మే ఐ హెల్ప్ యూ

**మెట్రో స్టేషన్లలో హెల్ప్‌డెస్క్‌లు.. ప్రతీ స్టేషన్లో రూట్‌మ్యాప్, చార్జీల ప్రదర్శన**

**బస్, రైల్వే, ఎంఎంటీఎస్, విమాన కనెక్టివిటీ వివరాలు**





సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ : అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకుని ప్రారంభానికి సిద్ధమవుతున్న హైదరాబాద్ మెట్రోరైలులో ప్రయాణికులకు ప్రతీ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. స్టేషన్లలో ప్రయాణికుల అవసరాలు తీర్చేందుకు హెల్ప్‌డెస్క్‌లు తీసుకురానున్నారు. దీనికి సంబంధించిన స్టేషన్లలో క్యాబిన్ల ఏర్పాటు ప్రక్రియను ఇప్పటికే పూర్తిచేశారు. మెట్రో ప్రయాణికులకు ఈ డెస్క్ అనేక రకాలుగా సహాయపడుతుంది. సమాచారం ఇవ్వడంతోపాటు సహాయ, సహకారాలు అందిస్తుంది. ఇందులో శిక్షణ పొందిన సిబ్బంది పనిచేస్తారు. స్టేషన్ రాకపోకల సమాచారంతోపాటు, దివ్యాంగులకు వీల్‌చైర్లు సమకూర్చి వారిని రైళ్లు ఎక్కించేవరకు సహాయపడుతారు. మెట్రోస్టేషన్లలో ఏర్పాటు చేసే చార్జీల పట్టికలో రైలు ప్రయాణ చార్జీలతోపాటు స్టేషన్లకు మధ్య ప్రయాణించే సమయాలతోపాటు తర్వాత వచ్చే స్టేషన్ వివరాలను పేర్కొంటారు. దీన్ని స్టేషన్‌లోకి ప్రవేశించగానే టికెట్ కౌంటర్ల వద్ద ప్రత్యేకంగా ప్రదర్శనకు ఉంచనున్నారు. మూడు కారిడార్లకు సంబంధించిన స్టేషన్లు, చార్జీలు స్పష్టంగా ప్రదర్శనకు ఉంచుతారు.

**నాలుగు భాషల్లో వివరాలు...**

ప్రతీ స్టేషన్లో మెట్రో ప్రయాణానికి సంబంధించి నాలుగు భాషల్లో వివరాలు అందుబాటులో ఉంటాయి. మ్యాప్‌తోపాటు ఇతర ప్రయాణ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం సమాచారం ఉంటుంది. ఈ వివరాలన్నీ తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషల్లో అందుబాటులో ఉంటాయి. ఈ మ్యాప్‌పై రాబోయే స్టేషన్స్, మెట్రో స్టేషన్లకు దగ్గరగా ఉండే రైల్వే, ఎంఎంటీఎస్ కనెక్టివిటీ, బస్‌స్టేషన్లు, ఎయిర్‌పోర్టు, స్టేషన్ సంఖ్య, చార్జీలు, ఇంటర్‌చేంజ్, దిగే స్థలం(టెర్మినస్), మీరు ఉన్న స్థలాన్ని సూచించే ఏర్పాట్లు స్టేషన్లలో ఉంటాయి.





## మెట్రో ప్రయాణికులు నేరుగా ఆఫీసుకు

**రోడ్డెక్కకుండానే ఆఫీసులకి.. మెట్రో స్టేషన్ నుంచి ప్రధాన కార్యాలయాలకు స్కైవేలు**

సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ : మెట్రోరైలు ప్రయాణంలో అన్నీ అద్భుతాలే. కనీవినీ ఎరుగని విశేషాలే. మెట్రో ప్రయాణానికి అనుబంధంగా కల్పిస్తున్న సౌకర్యాలు ప్రయాణికులకు కొత్త అనుభూతిని పంచనున్నాయి. ప్రయాణికులు స్టేషన్లో దిగి రోడ్డు మార్గం అవసరం లేకుండానే నేరుగా కార్యాలయాలకు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మెట్రో మార్గంలో ఉన్న ప్రధాన కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు నేరుగా స్టేషన్ నుంచి ఎటువంటి వాహనం లేకుండా నడిచివెళ్లే సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. స్టేషన్ నుంచి కిందకు దిగి రోడ్డు మార్గాన ప్రయాణించడం వల్ల సమయం వృథాతోపాటు స్టేషన్లలో రద్దీ, రోడ్డు ట్రాఫిక్ వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. వీటికి ఆస్కారం లేకుండా ప్రయాణికులు గమ్యం చేరేలా మెట్రో కారిడార్లకు సమాంతరంగా స్కైవేలు ఏర్పాటు చేస్తున్నారు. స్టేషన్లో దిగి స్కైవేల ద్వారా కార్యాలయాలకు వెళ్లవచ్చు. ఉదాహరణకు తార్నాకలో ఉన్న హెచ్‌ఎండీఏ కార్యాలయానికి వెళ్లాలన్న ఉద్యోగులు, ప్రజలు అక్కడికి సమీపాన ఉన్న స్టేషన్లో దిగి నడక ద్వారానో లేదా ఇతర ఏదైనా వాహనాన్ని ఉపయోగించి కార్యాలయానికి చేరుకోవాల్సిన అవసరం లేదు. నేరుగా స్టేషన్లో దిగి స్కైవే ద్వారా హెచ్‌ఎండీకు చేరిపోవచ్చు. దీని కోసం సమాంతరంగా ఉన్న స్కైవేకు అనుసంధానం చేస్తూ మరో వేలో హెచ్‌ఎండీఏ కార్యాలయానికి చేరుకోవచ్చు. అదేవిధంగా బేగంపేట మెట్రోరైలు భవన్‌కు చేరుకోవాలంటే రసూల్‌పూర స్టేషన్‌కు సమాంతరంగా ఏర్పాటు చేసిన స్కైవేను కార్యాలయం పరిసరాల్లోకి ఏర్పాటు చేస్తారు. మెట్రోరైలు వెళ్లాలనుకునేవారు, రావాలనుకునేవారు నేరుగా కార్యాలయాల్లోకి దిగవచ్చు. ఇలా మెట్రో మార్గంలోని ప్రముఖ కార్యాలయాలు, విద్యాలయాలు, దవాఖానలకు స్కైవేలు కనెక్ట్ చేస్తారు.

**రైల్వేస్టేషన్ నుంచి మెట్రోస్టేషన్‌కు..**

మెట్రోరైలు ప్రయాణికులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించడానికి స్టేషన్ కిందకు దిగి మళ్లీ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. సికింద్రాబాద్ మెట్రోరైలు స్టేషన్‌లో దిగినవారు నేరుగా సికింద్రాబాద్ రైల్వే జంక్షన్‌కు స్కైవే ద్వారా నడిచి వెళ్లిపోవచ్చు. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చినవారు సికింద్రాబాద్‌లో దిగి స్టేషన్ బయటకు రాకుండానే స్కైవేల ద్వారా మెట్రోస్టేషన్‌కు చేరుకోవచ్చు. ఇదంతా గొప్ప అనుభూతినిస్తుందని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.